క్లుప్తంగా

కొలనుభారతిలో ప్రత్యేక పూజలు


సరస్వతి అమ్మవారు

కొత్తపల్లి: మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కొలను భారతి దేవి ఆలయంలో సరస్వతి అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం సెలవు దినం కావడం, శ్రావణమాస నవమి రెండో ఆదివారం సందర్భంగా సరస్వతీ దేవిని ఆలయ పురోహితులు ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారు శాకాంబరి దేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారికి కుంకుమార్చన, పుష్పార్చన, బిల్వార్చన, ధారుఘోషిణి నదీజలాలతో అభిషేకం, మంగళహారతి వంటి విశేష పూజలు చేపట్టారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు


వాహనాల తనిఖీ చేస్తున్న ఎస్ఐ సురేష్ బాబు

పాములపాడు :రోడ్డు భద్రత నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని ఎస్ఐ సురేష్ బాబు అన్నారు. ఆదివారం కర్నూలు – గుంటూరు ప్రధాని రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా పలు వాహనాలను నిలిపి వాహన చోదకుల ధ్రువ పత్రాలను పరిశీలించారు. నిబంధనలు అతిక్రమించిన వారి నుంచి అపరాధ రుసుము వసూలు చేశారు. వాహన చోదకులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, బీమా ఎప్పటికప్పుడు చెల్లించాలని సూచించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని తెలిపారు. పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ప్రమాదాల నివారణ చర్యలు


రోడ్డుపై రంబుల్ స్ట్రిప్స్‌కు వైట్ పెయింట్ వేయిస్తున్న ఎస్ఐ సురేష్

వెలుగోడు: ఆత్మకూరు– నంద్యాల ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ఎస్ఐ సురేష్ చర్యలు చేపట్టారు. ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రధాన రహదారిలో మలుపుల వద్ద వాహనాల వేగాన్ని తగ్గించడం కోసం రంబుల్ స్ట్రిప్స్ (రహదారిపై గీతల మాదిరిగా వేసే స్పీడ్ బ్రేకర్లు)కు వైట్ పెయింట్ వేయించారు. అలాగే.. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, రహదారి సూచిక బోర్డులు, రేడియం స్టిక్కర్లతో కూడిన గుర్తులను ఏర్పాటు చేయించారు.

బానకచర్ల నుంచి 35 వేల క్యూసెక్కుల నీరు విడుదల


బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి విడుదలవుతున్న నీరు

పాములపాడు: మండలంలోని బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి ఆదివారం 35 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఏఈ దేవేంద్ర ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి ఎస్ఆర్ఎంసీ ద్వారా 35వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందన్నారు. కాగా తెలుగుగంగకు 15వేల క్యూసెక్కులు, జీఎన్ఎస్ఎస్‌కు 14,వేల క్యూసెక్కులు, కేసీసీ ఎస్కేప్ చానల్‌కు 6వేల క్యూసెక్కుల చొప్పున దిగువకు విడుదల చేస్తున్నట్లు వివరించారు.

నిప్పులవాగుకు 347 క్యూసెక్కుల నీరు విడుదల


కేసీ కాల్వలో ప్రవహిస్తున్న నీరు

జూపాడుబంగ్లా: లాకిన్స్‌లా నుంచి నిప్పులవాగుకు 347 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు కేసీ కాల్వ ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సుంకేసుల డ్యాం నుంచి 1,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా రైతుల వినియోగార్థం లాకిన్స్‌లాకు 662 క్యూసెక్కుల నీరు చేరుతున్నట్లు తెలిపారు.

ఈ నీటిని నిప్పులవాగుకు 347 క్యూసెక్కులు, తూడిచెర్ల సబ్‌చానల్ కాల్వకు 300 క్యూసెక్కులు, ఏబీఆర్ కాల్వకు 15 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. మరో రెండు రోజుల్లో కేసీ కాల్వలో నీటిసరఫరా పెరగనుందని చెప్పారు.


ఎస్సార్ఎమ్సీ కాల్వలో దిగువకు పరుగులు తీస్తున్న కృష్ణమ్మ


ఎత్తైన గేట్లపై నుంచి కిందికి దూకుతున్న కృష్ణా జలాలు

కృష్ణాతీరం...అలల సోయగం!

జూపాడుబంగ్లా: కృష్ణాతీరం అలలసోయగంతో పర్యాటకులను ఆకట్టుకొంటోంది. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ పరిసరాలతో పాటు ఎత్తైన గేట్లపై నుంచి జాలువారుతూ ఎస్సార్ఎమ్సీ కాల్వలో కృష్ణమ్మ హొయలొలుకుతూ వినసొంపైన సవ్వడులు చేస్తూ దిగువకు పరుగులుతీస్తున్న దృశ్యం చూపరులను ఆకట్టుకొంటుంది. కనుచూపు మేరలో ఉన్న కృష్ణాజలాలు గాలుల తాకిడికి అలలు సవ్వడులు చేస్తూ..తీరం చేరుకునే దృశ్యాలను కళ్లప్పగించి చూడాల్సిందే. ఆదివారం సెలవు దినం కావటంతో పర్యాటకులు పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్, చాబోలు సమీపంలోని కృష్ణాతీరం వెంట కృష్ణా జలాలను చూస్తూ ఆనందపరవశులయ్యారు.


చాబోలు సమీపంలో తీరం చేరుతున్న కృష్ణమ్మ అలలు

మల్లన్న సేవలో జిల్లా కలెక్టర్

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్లను జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆదివారం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన జిల్లా కలెక్టర్‌కు ఆలయ రాజగోపురం వద్ద దేవస్థాన ఏఈఓ, ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆమె మల్లికార్జున స్వామి వారికి రుద్రాభిషేకం, భ్రమరాంబా దేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆలయం వద్దనున్న ఆశీర్వచన మండపంలో కలెక్టర్‌కి వేదపండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. దేవస్థాన ఈఓ స్వామి వారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదం, జ్ఞాపికను అందించి సత్కరించారు.


శ్రీశైల మల్లన్నను దర్శించుకున్న కలెక్టర్ జి.రాజకుమారి

బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తాచాటాలి

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తాచాటాలని జిల్లా క్రీడాకారులకు బాల్ బ్యాడ్మింటన్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు షేక్షావలిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని గుడ్‌షెప్పర్డ్ పాఠశాల క్రీడా మైదానంలో ఉమ్మడి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్ బాలబాలికలు, సీనియర్ స్త్రీ పురుషుల బాల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ షేక్షావలిరెడ్డి మాట్లాడుతూ క్రీడల వల్ల శారీరక ధృడత్వం, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో విజయం సాధించి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. బాల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలకు వచ్చిన క్రీడాకారులకు భోజన వసతి కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి 200 మంది పాల్గొన్నట్లు కార్యదర్శి బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సురేష్‌బాబు, ట్రెజరర్ చంద్రారెడ్డి, సీనియర్ క్రీడాకారుడు శివారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు దేవేంద్ర, రాజు, సువర్ణ, రాము తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లోకి అనుమతి నిరాకరించడం సిగ్గుచేటు

ఆత్మకూరు: ప్రభుత్వ పాఠశాలల్లో రాజకీయ పార్టీల, విద్యార్థి సంఘాల నాయకులకు అనుమతి లేదుంటూ ప్రభుత్వం జీవో తేవడం సిగ్గుచేటని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ఆర్.నాయక్, అధ్యక్షుడు రాజా అన్నారు. ఆదివారం స్థానిక ఆర్టీసీ బస్టాండు ఎదుట జీవో ప్రతులను దహనం చేసి నిరసన తెలియజేశారు. వారు మాట్లాడుతూ పాఠశాలలోని మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు మినహా ఎవరినీ అనుమతించరాదని విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులు విద్యార్థుల స్వేచ్ఛను, ప్రజాస్వామిక హక్కులను హరించేలా ఉన్నాయని మండిపడ్డారు. వెంటనే ఈ జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు దినేష్, గర్ల్స్ కన్వీనర్ సుజాత, సహాయ కార్యదర్శి హరివర్ధన్, ఆత్మకూరు మండల అధ్యక్ష కార్యదర్శులు సాయి, ప్రశాంత్ పాల్గొన్నారు.


జీవో ప్రతులను దహనం చేసి నినాదాలు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

దాతల సహకారం..అధునాతన ఆలయ సాకారం

- వాసవి మాత ఆలయ పునర్నిర్మాణం
- నేటి నుంచి ప్రతిష్ఠోత్సవాలు

వెలుగోడు : దాతల సహకారంతో మండల కేంద్రంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయం సుమారు ఆరున్నర సెంట్ల స్థలంలో అధునాత సౌకర్యాలతో పునర్నిర్మించారు. పనులు ముగియడంతో ఆలయ పునఃప్రతిష్ఠకు సర్వం సిద్ధం చేశారు. ఈ నెల 4వ తేదీ నుంచి ప్రతిష్ఠోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 1981లో లాలం రామసుబ్బయ్య అమ్మవారి ఆలయ ఏర్పాటుకు ఒక సెంటు స్థలంతో పాటు ఒకటిన్నర ఎకర పొలం విరాళంగా ఇచ్చారు. ఆలయ నిర్మాణం అనంతరం నాగేళ్ల సుబ్బరాయుడు, ఆయన ధర్మపత్ని సీతమ్మ, వారి కుమారులు అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు. లాలం తులసయ్య, లాలం జయరామయ్య, లాలం సీతన్న, లాలం బాలి శెట్టి ఆధ్వర్యంలో ఆలయానికి ఉత్సవ విగ్రహాలు అందజేశారు. ఆలయం పురాతనంగా మారడం, ఇరుకుగా ఉండటంతో పునర్నిర్మాణానికి దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. అందరి సహకారంతో విశాలమైన, సకల వసతులతో మందిరాన్ని నిర్మించారు.


6న ఆధ్యాత్మిక ప్రవచన పునఃప్రతిష్ఠ

ఆలయ నిర్మాణం పూర్తి కావడంతో ఈ నెల 6వ తేదీ పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి శ్రీ ప్రజ్ఞానంద సరస్వతి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక ప్రవచన పునః ప్రతిష్ఠ చేయనున్నారు. స్వామి వారి ఆశీస్సులతో ఈ నెల 4 నుంచి 6 తేదీ వరకు వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో వేడుకలు జరుగనున్నాయి.పునః ప్రతిష్ఠోత్సవాలను ఆర్య వైశ్యులు విజయవంతం చేయాలని ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు లాలం సుధాకర్, ప్రధాన కార్యదర్శి లాలం రామకృష్ణ, ఉపాధ్యక్షుడు లాలం జనార్ధన కోరారు.

పూజా కార్యక్రమాలు..

పునఃప్రతిష్ఠలో భాగంగా 4న గణపతి పూజ, కంకధారణ, గోపూజతో పాటు 11 గంటలకు పట్టణంలో దేవతామూర్తుల గ్రామోత్సవం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. అలాగే లలిత భక్తుల కోలాట కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. అదే రోజు సాయంత్రం మంగళహారతి, ప్రసాద వితరణ, 5న చండీ హోమం, నివేదన మంగళహారతి, ప్రసాద వితరణ, సాయంకాలం 6:30 గంటల నుంచి సామూహిక కుంకుమార్చన, 6న ఉదయం ఎనిమిది గంటలకు ప్రాతఃకాల పూజ, క్షీర తర్పణాలు, యంత్రాభిషేకాలు, శిఖర కలశ ప్రతిష్ఠ, ధ్వజ ప్రతిష్ఠ, మూర్తి ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠాపన, బలిదానం, పూర్ణాహుతి, కలశ ఉద్వాసన, మంగళ హారతి, తీర్థ ప్రసాద వితరణ ఉంటుందని చెప్పారు. అన్నదానం అనంతరం పట్టణంలోని 400 మంది ఆర్యవైశ్య ఆడపడుచులకు ఒడి బియ్యం కార్యక్రమం మహిళా మండలి అధ్యక్షురాలు లాలం మాధవి, కార్యవర్గ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు.


పునఃప్రతిష్ఠకు సిద్ధంగా ఉన్న అమ్మవారి ఆలయం


వాసవీ కన్యకా పరమేశ్వరి

నాగటూరు లిఫ్ట్ నుంచి నీరు విడుదల చేయాలి


పటేల్ సెంటర్‌లో రాస్తారోకో చేస్తున్న రైతులు

నందికొట్కూరు: నాగటూరు లిఫ్ట్ ద్వారా పంటలకు సాగునీరు విడుదల చేయాలని, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అరుణ్‌కుమార్, సీపీఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా కార్యదర్శి నరసింహులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని పటేల్ సెంటర్‌లో ప్రధాన రహదారిపై నందికొట్కూరు, లక్ష్మాపురం గ్రామాల రైతులతో రాస్తారోకో నిర్వహించారు. వారు మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు వేసిన మొక్కజొన్న పంట ఎండిపోతుందన్నారు. నాగటూరు ఎత్తిపోతల పథకం ద్వారా ఖరీఫ్ సీజన్‌లో 10 వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చి రైతులను ఆదుకోవాలని కోరారు. కర్ణాటక, మహారాష్ట్ర లో భారీ వర్షాలు కురవడంతోనే శ్రీశైలం ప్రాజెక్టు జూలై చివరిలోపు నిండినా, కూటమి ప్రభుత్వం రైతులకు సాగు, తాగు నీరందించడంలో విఫలమైందని ధ్వజమెత్తారు. నాయకులు మజీద్‌మియ్యా, మహబూబ్‌బాషా, మాసూం, జయన్న, ఆది, శ్రీను, ఉస్మాన్, సురేష్, దిబ్బన్న, పక్కీరయ్య పాల్గొన్నారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో ఆర్‌యూ వీసీ పూజలు

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ వి. వెంకట బసవ రావు ఆదివారం పూజలు నిర్వహించారు. స్వామి దర్శనార్థం కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన ఆయనకు ఆలయ ఏఈఓ ఎరమల మధు, వేదపండితులు రవిశంకర అవధాని స్వాగతం పలికారు. ఈ మేరకు వారు స్వామి, అమ్మవారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. దర్శనం అనంతరం స్థానిక కల్యాణ మండపంలో స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు. వారి వెంట డాక్టర్ రామకృష్ణారెడ్డి ఉన్నారు.


వీసీకి స్వామి వారి చిత్రపటం అందిస్తున్న ఏఈఓ మధు

హామీలను అమలు చేయాలి

నందికొట్కూరు: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని వినోద్ కార్యాలయంలో జరిగిన మహాసభలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో స్మార్ట్ మీటర్లు బిగించి ప్రజలపై భారం మోపడం తగదని చెప్పిన చంద్రబాబు.. తన పాలనలో స్మార్ట్ మీటర్లు ఎలా బిగిస్తారని ప్రశ్నించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో ఎంత మంది పిల్లలు చదువుకుంటే అంత మందికి తల్లికి వదనం ఇస్తానని చెప్పి సగం మందికి కూడా ఇవ్వలేదని ఆరోపించారు. కొత్త పింఛన్లు అర్హులైన వారందరికీ మంజూరు చేయకపోవడంలో ఆంతర్యమేమిటని నిలదీశారు. అనంతరం పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయకులు షేక్షావలి, భాస్కర్‌గౌడ్, వడ్డేరాజు, భార్గవ్, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలను అరికట్టాలి

ఆత్మకూరు: ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో అదానీ స్మార్ట్ బాంబు మా ఇంటికి బిగించొద్దు అని, విద్యు చార్జీల నిలువుదోపిడీని అరికట్టాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వి.యేసురత్నం, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి చందావారి వెంకటేశ్వర్లు, పట్టణ పౌర సమాఖ్య నాయకులు ఎ.రణధీర్ అన్నారు. ఆదివారం విద్యుత్‌శాఖ కార్యాలయం ఎదుట ఈనెల 5వ తేదీన చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని మండలంలోని నల్లకాలువ, కొత్తరామాపురం, బాపునంతాపురం, కురుకుంద, కరివేన గ్రామాల్లో పర్యటించి ప్రజలకు చార్జీలు, స్మార్ట్ మీటర్ల గురించి వివరించారు. ఏపీ రైతు సంఘం మండలాధ్యక్షులు పీమాబాషా, కార్యదర్శి వీరన్న, కౌలు రైతు సంఘం నాయకులు శీను, ఆశీర్వాదం పాల్గొన్నారు.

వెంగల్‌రెడ్డినగర్‌లో కార్డెన్ సెర్చ్


సోదాల్లో పాల్గొన్న సీఐ రాము, పోలీసులు


10 బొల్లవరంలో అనుమానిత ఇళ్ల పరిసరాల్లో సోదాలు చేస్తున్న పోలీసులు

ఆత్మకూరు: పట్టణంలోని వెంగల్‌రెడ్డినగర్‌లో ఆదివారం సీఐ రాము ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా సరైన ధ్రువ పత్రాలు లేని 26 మోటార్ సైకిళ్లు, 12 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

10 బొల్లవరంలో..

నందికొట్కూరు: మండలంలోని 10 బొల్లవరం గ్రామంలో ఆదివారం రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, బ్రాహ్మణకొట్కూరు ఎస్ఐ తిరుపాలు, పోలీసు సిబ్బందితో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానిత వ్యక్తులు, రౌడీ షీటర్ల ఇళ్లలో సోదాలు చేశారు. లక్ష్మీదేవి, రాముడు నిర్వహిస్తున్న బెల్ట్ షాపుల్లో 30 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. రూరల్ సీఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై సమాచారమివ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ధ్రువపత్రాలు లేని మోటారు సైకిళ్లు 9, ఒక ఆటో స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

నాటుసారా విక్రేత అరెస్ట్

పగిడ్యాల: నాటుసారా విక్రేతను అరెస్ట్ చేసినట్లు ముచ్చుమర్రి స్టేషన్ ఏఎస్ఐ సుబ్బారావు ఆదివారం తెలిపారు. ముచ్చుమర్రి గ్రామానికి చెందిన బోయ చిన్నదంతాలు కుమారుడైన బోయ లింగమయ్య ఉదయం 5 లీటర్ల నాటుసారాను తరలిస్తుండగా జెడ్పీ ఉన్నత పాఠశాల క్రాస్ రోడ్డు వద్ద స్వాధీనం చేసుకుని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామని ఏఎస్ఐ వెల్లడించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

పంటలు ఎండుతున్నా పట్టించుకోరా?

నందికొట్కూరు: నాగటూరు ఎత్తిపోతల పథకం ఫేస్–1, ఫేస్–2 ద్వారా సాగునీరు అందక మొక్కజొన్న, కంది పంటలు ఎండుతుంటే రైతులు ఆందోళన చెందుతున్నా పట్టించుకునే నాథుడే లేరని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక తన స్వగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లిఫ్ట్ ఇరిగేషన్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు, ఆయిల్, పైపులు దొంగలించిన వారిపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. కబ్జాలు, ఇసుక, బియ్యం తరలింపు ఉన్న శ్రద్ధ రైతులపై ఎందుకు లేదని ప్రశ్నించారు.

ట్యాంకు నిర్మాణం పూర్తిచేయించండి సారూ!

మండలంలోని 80బన్నూరు గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం త్వరగా పూర్తిచేయించి తాగునీటిని సరఫరా చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు. రూ.43.10లక్షల జలజీవన్ మిషన్ నిధులతో గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణంతో పాటు పైపులైన్, 50 కుళాయిలను ఏర్పాటు చేయించాల్సి ఉంది. పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ నత్తనడకన పనులు చేస్తుండటంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు త్వరగా పనులు పూర్తిచేయించి నీటిని సరఫరా చేయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. – జూపాడుబంగ్లా



పందుల నుంచి పంటలను కాపాడండి


పందుల యజమానులతో మాట్లాడుతున్న గ్రామపెద్దలు

జూపాడుబంగ్లా: మొక్కజొన్న, వరి, మిరప, కంది పంటలను పందులు నాశనం చేస్తుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రానికి చెందిన ఎరుకలివారు పందులు పెంచుకొంటూ జీవనం సాగిస్తున్నారు. వారు పందులను విచ్చలవిడిగా వదిలి పెట్టడంతో అవి గ్రామ సమీపంలోని పంటలపై పడి నాశనం చేస్తున్నాయి. గ్రామానికి చెందిన సత్యాలు, మధు, సాధిక్, మరికొంత మంది రైతుల మొక్కజొన్న, వరి నారుమళ్లల్లో చొరబడి నాశనం చేశాయి. దీంతో చేతికొచ్చిన పంటలు దెబ్బతినటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పందులను కట్టడిచేయాలని పలుమార్లు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేదని రైతులు వాపోయారు. ఈ విషయమై గ్రామపెద్దలకు తెలియజేయడంతో వారు పందుల పెంపకందారులను పిలిపించి పంచాయితీ నిర్వహించారు. ఐదు రోజుల్లోగా పందులను గ్రామంలో తిరగకుండా చేస్తామని వారు గ్రామపెద్దలకు , రైతులకు తెలపటంతో రైతులు శాంతించారు.


పందులు నాశనం చేసిన మొక్కజొన్న పంట

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

నంద్యాల(అర్బన్): మైనర్లకు వాహనాలు ఇచ్చినా, వారు వాహనాలు నడిపినా చట్ట ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున గుప్త హెచ్చరించారు. నంద్యాల ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో శనివారం రాత్రి మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడుపుతూ పట్టుబడిన 47 మంది మైనర్లకు ఒక్కొక్కరికి రూ.5,035 చొప్పున రూ.2,36,645 జరిమానా విధించామని చెప్పారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరం గ్రామంలోని శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన బొలిశెట్టి జయరామ్, సతీమణి ధనలక్ష్మీ, కుటుంబ సభ్యులు రూ.50,116లను విరాళంగా అందజేసినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీకుమార్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఈ విరాళాన్ని జయరామ్ అన్న శేలు బొలిశెట్టి గురుప్రసాద్, హైదరమ్మ దంపతుల జ్ఞాపకార్థం అందజేసినట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక

కోవెలకుంట్ల: పట్టణంలోని సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం గీతా తెలిపారు. గత నెల 26వ తేదీన ఇదే పాఠశాల క్రీడామైదానంలో జిల్లా స్థాయి షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు జరిగాయన్నారు. పోటీల్లో బాలుర విభాగంలో నాగ ఉదయ్, హనీఫ్, కాశీం, నిఖిల్, అభినయ్, బాలికల విభాగంలో సాయిప్రియ, నందిని, పావని ప్రతిభ చాటి త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో మౌలిక వసతులు కల్పించాలి


రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులతో మాట్లాడుతున్న వెంకట రంగయ్య

కోవెలకుంట్ల: నంద్యాల– యర్రగుంట్ల రైల్వే మార్గంలోని కోవెలకుంట్ల రైల్వేస్టేషన్‌లో మౌలిక వసతులు కల్పించాలని ప్రయాణికులు కోరారు. దక్షిణమధ్య రైల్వే జోనల్ వినియోగదారుల కన్సల్టెంట్ మెంబర్ వెంకటరంగయ్య శనివారం రాత్రి స్థానిక రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్‌లో వేచి ఉన్న తిరుపతి, అమరావతి ప్రాంతాల వైపు వెళ్లే ప్రయాణీలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి తోపాటు ప్రజా సంఘాల ప్రత్యేక కృషి వల్ల గుంటూరు– తిరుపతి ఎక్స్‌ప్రెస్, తెలంగాణా రాష్ట్రం నాందేడ్ నుంచి ధర్మవరం వెళ్లే ప్రత్యేక రైలుకు ఈనెల 2వ తేదీ నుంచి కోవెలకుంట్లలో స్టాపింగ్‌కు అనుమతి ఇచ్చారన్నారు. రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు మంచినీటి సరఫరా, వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లల సౌకర్యార్థం లిఫ్ట్, రైల్వేస్టేషన్‌కు వెళ్లే రెండు వైపు రహదారులను పునర్నిర్మించాలని, రోడ్ల వెంట వీధి దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. కోవెలకుంట్ల, బనగానపల్లె రైల్వేస్టేషన్‌లో టికెట్ రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటు చేయాలని, స్టేషన్లలో రైలు పేర్లతో బోగీల వరుసల క్రమంలో డిజిటల్ డిస్‌ప్లే బోర్డులు అమర్చాలన్నారు. సమస్యలను ఆ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.